క్లుప్తంగా

రైతులకు స్ప్రింక్లర్ పైపుల అందజేత



పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి, శాగాపూర్ గ్రామాలకు చెందిన 15 మంది రైతులకు సబ్సిడీ స్ప్రింక్లర్ పైపులను మంగళవారం సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్ అందజేశారు. రైతులు స్ప్రింక్లర్లను వినియోగించడంతో నీటిని ఆదా చేయడంతో పాటు పంటల దిగుబడి కూడా పెరుగుతుందన్నారు. స్ప్రింక్లర్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అవగాహన సదస్సులతో రైతులకు ప్రయోజనం

వీపనగండ్ల: రైతు నేస్తం కార్యక్రమం ద్వారా మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ పద్ధతిన పలు రకాల పంటలపై రైతులకు అవగాహన కల్పించినట్లు మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్‌గౌడ్ తెలిపారు. మంగళవారం రైతువేదికలో ఏర్పాటు చేసిన పచ్చిరొట్ట ఎరువుల వినియోగం అనే అంశంపై శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మట్టి ట్రాక్టర్ల పట్టివేత



ఆత్మకూర్: ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మొరం మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం జూరాల గ్రామ శివారు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఐదు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి, తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



ఆత్మకూర్: సైబర్ నేరగాళ్లతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లాటరీ తగిలిందని లేదా ఇతర కారణాలు చెబుతూ ఖాతాలను ఖాళీ చేస్తారని ఎస్ఐ నరేందర్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదురుగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కాల్స్‌ను నమ్మకూడదని, ఆధార్ అప్‌డేట్ అని, వాట్సాప్‌లో నగ్న వీడియోలు ఉన్నాయని, సైబర్‌క్రైం పోలీసులమని, లింకులను ఓపెన్ చేయమని తదితర కాల్స్, మెసేజ్‌లను స్పందించకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రోషయ్య, హెచ్‌సీ మన్నెపురెడ్డి, సిబ్బంది సురేందర్, భూపాల్, రాములు, పుష్పలత, కృష్ణవేణి, స్థానికులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 9 గొర్రెపిల్లలు మృతి



పాన్‌గల్: కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన ఘటన మంగళవారం పాన్‌గల్‌లో చోటు చేసుకుంది. గొర్రెల కాపారి పెంటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమ గొర్రె పిల్లలను గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో వలలో ఉంచి గొర్రెలను మేతకు తీసుకెళ్లామని, సాయంత్రం వచ్చి చూసే సరికి వలలో ఉన్న గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేసి 9 గొర్రె పిల్లలను చంపాయని పేర్కొన్నారు. వీటి విలువ దాదాపుగా రూ.25 వేల వరకు ఉంటుందని వాపోయారు.

రక్త నమూనాల సేకరణ



పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు సబ్‌సెంటర్ల పరిధిలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మిషన్ మధుమేహ కార్యక్రమంలో భాగంగా డయాబెటిస్ వ్యాధి నిర్ధారణ అయిన వారి నుంచి మంగళవారం రక్త నమూనాలు సేకరించినట్లు సీహెచ్ఓ రామయ్య తెలిపారు. సేకరించిన రక్త నమూనాలను టీ హబ్ ద్వారా హెచ్‌బీ 1 ఏసీ, ఆర్ఎఫ్‌టీ, సీబీపీ మరియు లిపిడ్ ప్రొఫైల్ పరీక్షలు నిర్వహించుటకు జిల్లా కేంద్రానికి పంపించామన్నారు. కేతేపల్లి సబ్‌సెంటర్‌లో నిర్వహించిన పరీక్షలను సీహెచ్ఓ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుమనశ్రీ, శాంతమ్మ, శ్రీలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో తిరకాసు

- మిల్లర్లతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కుమ్మక్కు
- సన్నాలను ముందస్తుగా కొనుగోలు చేసి మిల్లులకు తరలింపు
- దొడ్డు రకాలను సాగు చేసిన రైతులకు ఇక్కట్లు
- పెబ్బేరు, వీపనగండ్ల మండల కేంద్రాల్లో రోడ్డుపై బైఠాయించి నిరసన
- కలెక్టరేట్‌లో ఆరేపల్లి గ్రామస్తుల ఆందోళన



సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం కార్యాలయంలో సిబ్బందితో వాగ్వాదం చేస్తున్న ఆరేపల్లి గ్రామ రైతులు

వనపర్తి/ఆత్మకూర్/వనపర్తిరూరల్/వీపనగండ్ల: జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో గందరగోళం నెలకొంది. అధికారులు ఒకచోట సమస్యను పరిష్కరిస్తే.. మరోచోట ఉత్పన్నమవుతోంది. ధాన్యం కొనటం లేదని మంగళవారం ఒకేరోజు మూడు వేర్వేరు ప్రాంతాల్లో రైతులు ఆందోళనకి దిగారు. ఆత్మకూర్ మండలంలోని ఆరేపల్లిలో దొడ్డు రకం వడ్లు కొనకుండా రైతులను నెల రోజులుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టరేట్‌లో ఆందోళన చేపట్టారు. అంతకంటే ముందు సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం కార్యాలయం సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటపాటు నిరసన వ్యక్తం చేసిన రైతులు సమస్యను కలెక్టర్ ఆదర్శ్‌సురభి దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించి ఆయన వెంటనే రైతుల ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. దీంతో రైతులు శాంతించారు. ఒక్క ఆరేపల్లి కొనుగోలు కేంద్రంలోనే.. దొడ్డురకం వడ్లు కొనుగోలు చేయాల్సినవి 50 వేల బస్తాలకు పైబడి ఉన్నట్లు రైతులు కలెక్టర్ వివరించారు.

- పెబ్బేరు మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో వరిధాన్యం సకాలంలో కొనుగోలు చేయటం లేదని రైతులు బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి స్థానిక సుభాష్ చౌరస్తాలో గంటపాటు రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లతో కుమ్మక్కై, తరుగు పేరుతో దోపిడి చేస్తున్నారని ఆరోపించారు.
- వీపనగండ్ల మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు రోడెక్కి నిరసన వ్యక్తం చేశారు.

మిల్లర్లతో నిర్వాహకుల కుమ్మక్కు

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సివిల్ సప్లయ్ అధికారులు, మిల్లర్లతో కుమ్మక్కై మార్కెట్‌లో ఎక్కువగా డిమాండ్ ఉన్న సన్నవడ్లను ఎప్పటికప్పుడు కొనుగోలు చేస్తూ.. మిల్లులకు తరలిస్తున్నారు. దొడ్డు రకం వడ్లు తెచ్చిన రైతుల ధాన్యాన్ని హమాలీలు, లారీల కొరత, ఇతర కారణాలను చూపిస్తూ.. కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. సన్నవడ్లతో మిల్లర్ కేటాయింపుల కోటాను త్వరితగతిన పూర్తి చేసుకుని దొడ్డు రకాలను తీసుకునేందుకు అవకాశం లేకుండా చేయాలనే ఎత్తుగడ వేసి మిల్లర్లు మొదటి ప్రాధాన్యత కొనుగోళ్లను సన్నరకాల వడ్ల చేసేలా లోపాయికార ఒప్పందాలు క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున చేస్తున్నట్లు తెలుస్తోంది.

తరుగు పేరుతో దోపిడి

తాలు, తరుగు పేరుతో రైతులను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు దోపిడి చేస్తున్నారు. బస్తాకు 4 నుంచి 5 కేజీల ధాన్యం ఎక్కువగా తూకాలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా.. సమస్యను పరిష్కరించటం లేదని రైతులు వాపోతున్నారు.

నెల రోజులు కావస్తోంది



ఆరేపల్లిలో దొడ్డు రకం వడ్లను పక్కన పెట్టి సన్నాలు కొంటున్నారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు మిల్లర్లతో మాట్లాడుతుని సన్నవడ్లను కొని పంపిస్తున్నారు. మమ్మల్ని నెల రోజుల నుంచి రేపుమాపు అంటూ.. కనీసం తూకాలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు.

– బాలస్వామి, ఆరేపల్లి, ఆత్మకూర్

2వేల బస్తాలు తీసుకొచ్చా..



రెండు వేల బస్తాల దొడ్డు రకం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చి నెల రోజులవుతోంది. రోజుకో కారణం చెప్తూ.. కొనటం లేదు. చేసేది లేక జిల్లా కేంద్రంలో సివిల్ సప్లయ్‌శాఖ అధికారులు, కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించాలని వచ్చాం.

– బాలచంద్రయ్య, ఆరేపల్లి, ఆత్మకూర్

ప్రతి గింజ కొంటాం

రైతులు అధైర్యపడొద్దు, పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తాం. హమాలీలు, లారీల కొరతతో కొద్దిగా సమస్య ఉంది. మా దృష్టికి వచ్చిన సమస్యలను కలెక్టర్ వివరించాం. కలెక్టర్ స్వయంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడి ఎక్కడా దొడ్డురకం వడ్ల కొనుగోళ్లలో నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఆరేపల్లి గ్రామ రైతులు సమస్య రెండురోజుల్లో పరిష్కారం అవుతుంది.

– జగన్మోహన్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, వనపర్తి

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



వనపర్తి: రైతులకు ఇబ్బందులు కలగకుండా మిల్లర్లు ధాన్యాన్ని త్వరగా దించుకొని లారీలను త్వరగా పంపించాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. మంగళవారం రాజనగరం వరి కొనుగోలు కేంద్రాన్ని, చిట్యాల వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర ఇండస్ట్రీస్ రైస్‌మిల్లును కలెక్టర్ సందర్శించారు. అకాల వర్షాలు పడుతుండటంతో రైతులు వరి కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు పడే అవకాశం ఉందని, అందువల్ల మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వేగంగా అన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సన్నరకంతో పాటు దొడ్డు రకం వడ్లు తీసుకోవాలని ఆదేశించారు. వెంకటేశ్వర మిల్లులో ధాన్యం నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, తహసీల్దార్ రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేయాలని కలెక్టర్ ఆదర్శ్‌సురభి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ తన చాంబర్‌లో వనపర్తి పట్టణం నుంచి వెళ్లే పాన్‌గల్, కొత్తకోట, పెబ్బేరు రహదారుల విస్తరణపై సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న షాపులు, ఇళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసి రోడ్డు విస్తరణకు సహకరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, రోడ్లు భవనాల శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే



మదనాపురంలో విద్యార్థులతో మాట్లాడుతున్న క్రీడల అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి



దొండాయిపల్లిలో ఎంఈఓ శ్రీనివాసులు

పాన్‌గల్: మండలంలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో స్థానిక హెచ్‌ఎం శ్రీనివాస్‌గౌడ్ స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన వేసవి శిబిరాన్ని ఎంఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రాథమిక పాఠశాలల్లో అధికారికంగా వేసవి శిబిరాల ఏర్పాటు చేయాలనే నిబంధనలు లేకపోయిన విద్యార్థులపై శ్రద్ధతో పాఠశాల హెచ్‌ఎం శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం అన్నారు.

మదనాపురం: విద్యార్థులకు చదవుతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యమని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి సుధీర్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మంగళవారం మదనాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, స్కూల్ గేమ్స్ అసోసియేషన్ పోటీల్లో అత్యుత్తమంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ సురేందర్‌రెడ్డి, హెచ్‌ఎంలు మద్దిలేటి, వెంకటస్వామి, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు రామ్మోహన్‌చారి తదితరులు పాల్గొన్నారు.

42 ట్రిప్పుల ఇసుక వేలం

ఖిల్లాఘనపురం: మండలంలోని మామిడిమాడ వాటర్ ట్యాంక్ వద్ద అక్రమంగా డంప్ చేసిన 42 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకకు సంబంధించి నెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు తహసీల్దార్ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తామని తహసీల్దార్ సుగుణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఇసుకను ఏప్రిల్ 7న పరిశీలించి సీజ్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు ఒక్కో ట్రిప్పుకు ప్రభుత్వం ధర రూ.1800 చెల్లించాలన్నారు. వేలంలో ఎక్కువ మంది పాల్గొంటే ఎక్కువ ధర చెల్లించే వారికి ఇసుక అప్పగిస్తామని పేర్కొన్నారు.

జీవిత బీమాతో కుటుంబానికి భరోసా



ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అమర్

పాన్‌గల్: ఎస్‌బీఐ ద్వారా పర్సనల్ ప్రమాద ఇన్సూరెన్స్, సాధారణ ఇన్సూరెన్స్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అమర్ అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లి ఎస్‌బీఐ బ్రాంచ్‌లో ఎజ్జు రాంచంద్రయ్య పర్సనల్ ప్రమాద ఇన్సూరెన్స్ కింద రూ.500 పాలసీ చేశాడని, అతడు ఇటీవల ప్రమాదవశాత్తుతో మృతిచెందాడు. దీంతో ప్రమాద బీమా కింద రూ.10 లక్షలు మంజూరు కావడంతో నామిని అయిన మృతుడి భార్య జయసధకు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌బీఐ ద్వారా రూ.500కు రూ.10 లక్షలు, రూ.వెయ్యికి రూ.20 లక్షల బీమా, రూ.2 వేలకు రూ.40 లక్షల బీమా పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్ మేనేజర్ శేషు, పాన్‌గల్ ఎస్‌బీఐ మేనేజర్ నాగేష్, కేతేపల్లి ఎస్‌బీఐ మేనేజర్ రూన్సీ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



పాన్‌గల్: వివాహిత అదృశ్యమైన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ ఎస్ఐ హిమబిందు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లికి చెందిన గుజ్జుల పద్మ (32)కు ఇదే గ్రామానికి చెందిన గుజ్జుల నిరంజన్‌తో 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉంది. మార్చి 30వ తేదీన భర్త పనిమీద జిల్లా కేంద్రానికి వెళ్లగా భార్య పద్మ, కుమారుడు ఇంట్లోనే ఉన్నారు. సాయంత్రం ఇంటికి వచ్చిన భర్తకు ఇంట్లో ఉన్న భార్య కనిపించలేదు. ఈ విషయంపై కుమారుడితో ఆరా తీయగా బస్సు ఎక్కి వెళ్లిపోయిందన్నాడు. దీంతో బంధువులు, చుట్టుపక్కల వారితో, తెలిసిన వారితో ఫోన్‌లో ఆరా తీయగా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



యాపర్లలో పాఠశాలలో చేరిన విద్యార్థులు

వనపర్తి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని హెచ్‌ఎం శంకర్‌గౌడ్ అన్నారు. మంగళవారం పెబ్బేరు మండలంలోని యాపర్లలో బడి బాట కార్యక్రమంలో ఆయన ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. గ్రామంలో ఐదుగురు విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో విద్యార్థులకు చక్కటి విద్యతో పాటు యూనిఫాం, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తుందని తెలిపారు. తమ పాఠశాలలో విద్యార్థులకు ఆంగ్ల బోధన, లైబ్రరీ, సైన్స్‌ల్యాబ్ సౌకర్యం ఉందని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మైనుద్దీన్, శ్రీధర్, రాజ్యం, బురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ చట్టంపై అవగాహన



గ్రామస్తులకు అవగాహన ఉత్తరయ్య

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరంగాపురం మండలంలోని నాగరాల 1వ సెంటర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉపాధి హామీ చట్టంపై లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి ఉత్తరయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తాకిడి అధికంగా ఉన్నందున వడదెబ్బ తగలకుండా పని వద్ద కూలీలకు టెంట్లు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారికి సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న 100 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్తు పదార్థాలు, బాల్యవివాహాలను అరికట్టాలని, 18 ఏళ్లలోపు పిల్లలకు ఉచిత న్యాయ సేవలు కోసం టోల్‌ఫ్రీ నంబర్ 15100 కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో నాయవాది వెంకటస్వామి, ఏఎస్ఐ మన్యపురెడ్డి, వలంటీర్ బంకల రవి, దయాకర్, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య, నవనీత్ కుమార్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ముగ్గురికి గాయాలు

పాన్‌గల్: బైక్ అదుపుతప్పి ముగ్గురు యువకులకు గాయాలైన ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లికి చెందిన భాస్కర్, కురుమూర్తి, వనపర్తికి చెందిన శివ ముగ్గురు కలిసి పాన్‌గల్ నుంచి కేతేపల్లికి బైక్‌పై వెళ్తుండగా వెంగళాయిపల్లి సమీపంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో శివ కాలు ఫ్యాక్చర్ కావడంతో పాటు భాస్కర్‌కు తీవ్ర గాయాలు, కురుమూర్తికి స్వల్ప గాయాలయ్యాయని తెలిపారు. గాయపడిన యువకులను వెంటనే అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించగా.. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం శివను కర్నూల్‌కు, భాస్కర్‌ను హైదరాబాద్‌కు తరలించినట్లు వారు పేర్కొన్నారు. గాయపడిన యువకులను సీపీఐ నాయకులు పరామర్శించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి



బీజేపీ నూతన కమిటీ సభ్యులు

కొత్తకోట: పట్టణ కేంద్రంలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆ పార్టీ పట్టణ కోకన్వీనర్ భరత్‌భూషణ్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజవర్ధన్‌రెడ్డి, దేవరకద్ర ఇన్‌చార్జ్ కొండా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీని బలోపేతం చేసేందుకు నూతన మండల కమిటీని సిద్ధం చేశామన్నారు. పట్టణ అధ్యక్షుడిగా వనపర్తి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా చీర్ల తిరుపతయ్య సాగర్, చిన్న, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా స్వార్ బాలు, ఆవుల రాఘవేందర్‌గౌడ్, కార్యదర్శులు మద్యమోని వెంకటేష్, నాగరాజు, సురేష్ గౌడ్, జనంపల్లి ఏలియా ను ఎన్నుకున్నారు. అనంతరం కొండా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ అవినీతి, కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పరిపాలనను ప్రజలకు వివరించి రానున్న రోజుల్లో కొత్తకోట మున్సిపాలిటీపై భారతీయ జనతా పార్టీ జెండా ఎగరవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మద్దిగట్ల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పి.నవీన్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు తూమ్ అమరేందర్‌రెడ్డి, మహేష్, కురుమూర్తి, వెంకటేష్, అంజి, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని వినతి



అధికారిణికి వినతిపత్రం అందస్తున్న నిక్సన్

కొత్తకోట: ఆత్మకూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టులోని అంగన్‌వాడీ ఆయాల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. ఆయాలకు ఇప్పటి వరకు కొందరికి 10 నెలలు, మరికొందరికి 5 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ వేతనాలు తక్షణమే విడుదల అయ్యేలా చూడాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని ఐసీడీఎస్ డైరెక్టర్ అధికారిణి స్వరూపకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ వినతిపత్రం అందించారు. 2024 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఆయాలకు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయమై ఆత్మకూరు ఐసీడీఎస్ అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఐసీడీఎస్ డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ గాయత్రి, రాజేశ్వరి, శిరీష, రామేశ్వరి, అరుణ, మనీష, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో నెలకొన్న నీటి ఎద్దడిని తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించినట్లు నాగర్‌కర్నూల్ పర్యాటక శాఖ అధికారి నర్సింహ తెలిపారు. గతంలో గ్రామంలో నిర్మించిన తాగునీటి పైపులైన్ పాడైనందున నూతన పైపులైన్ నిర్మాణం కోసం రూ.22 లక్షలు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో నెలకొన్న నీటి సమస్యపై మంత్రి జూమ్ మీటింగ్ ద్వారా డీపీఓతో పాటు మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పాలిసెట్



గోపాల్‌పేటలో బందోబస్త్ నిర్వహిస్తున్న ట్రైయినీ ఎస్ఐ నరేష్, సిబ్బంది



పాన్‌గల్‌లో కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పాన్‌గల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్ష మండల కేంద్రంలో ప్రశాంతంగా ముగిసినట్లు చీఫ్ సూపరింటెండెంట్లు అజీమ్‌పాషా, శ్రీనివాసులు తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొత్తం 156 మంది విద్యార్థులకు గాను 146 మంది హాజరు కాగా.. 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వారు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 240 మంది విద్యార్థులకు గాను 224 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 16 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదు. కేంద్రాల వద్ద బందోబస్త్‌ను ట్రైయినీ ఎస్ఐ నరేష్, సిబ్బంది పర్యవేక్షించారు.

గ్రామాలకు బస్సులు నడపాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం ప్రతినిధులు

వనపర్తి విద్యావిభాగం: మారుమూల గ్రామాలు, పుణ్యక్షేత్రాలు, దూర ప్రాంతాలకు బస్సులు నడపాలంటూ, అందుకు అనుగుణంగా వనపర్తి డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని అఖిలపక్షం ఐక్యవేదిక ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు సతీష్‌యాదవ్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట, మంత్రాలయం, శ్రీశైలం, తిరుపతికి, చిట్యాల, పెద్దమందడి మీదుగా మహబూబ్‌నగర్, హైదరాబాద్ బస్సులు నడపాలని, పాత బస్టాండుకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. స్క్రాప్ బస్సుల స్థానంలో 20 బస్సులు వచ్చాయని, అవి సరిపోక మరో 25 బస్సులు డిపోకు అవసరమని వెంటనే తెప్పించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డికి, కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల శంకర్, గొనికాడి యాదయ్య, రాజ్‌కుమార్, మన్యంనాయక్, రాము యాదవ్, శివకుమార్, పుట్టపాక బాలు తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రాజు

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మోష మాట్లాడుతూ.. కేంద్రం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరిస్తు ప్రజలకు నష్టం చేకూరుస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో భారతీయుడు, వెంకటన్న, చెన్నప్ప, మహమ్మద్, బాలఅకృష్ణ, నాగన్న, వెంకటన్న, రాములు, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.
ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349
వనపర్తి ఎం. జగదీశ్వర్ - 9912370010
కొత్తకోట / పెబ్బేర్ ఇ. రాజశేఖర్ గౌడ్ - 97000 09392
టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083
సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :
జబ్బర్ లాల్ : 9553955603